సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 22 । జూన్ । 2025



ప్రయాణికుల కస్సు'బస్సు'

యోగాంధ్ర కారణంగా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. సరిపడా సర్వీసులు లేక ఇక్కట్లు పడ్డారు.

- 8లో



విలీన గందరగోళం

పాఠశాలల విలీనం గందరగోళం సృష్టిస్తోంది. పలు పాఠశాలలకు తాళాలు పడ్డాయి.

- 8లో



ఆసనం వేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

న్యూస్‌రీల్

'ఆహ్వానించి అవమానించారు'

టెక్కలి: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగా దినోత్సవం కార్యక్రమానికి ఆహ్వానించి అవమానించారని ఎంపీటీసీ సభ్యురాలు, యోగా నిర్వాహకురాలు సత్తారు ఉషారాణి ఆవేదన వ్యక్తం చేశారు. ముందు రోజు తమను ఆహ్వానించి కళాశాలలో యోగా దినోత్సవ కార్యక్రమానికి సహకరించాలని కోరారని, తీరా కళాశాలకు వెళితే...రాజకీయ పార్టీ పేరును ఆపాదించి అవమానించారని ఆమె వాపోయారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పీఎం, సీఎం ప్రకటనలు చేశారని ఇక్కడ మాత్రం ఆ పరిస్థితులు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

యోగాంధ్రకు వెళ్లి వస్తూ..

రణస్థలం: మండలంలోని రణస్థలం జాతీయ రహదారిపై యోగాంధ్ర వెళ్లి వస్తుండగా గనగళ్ల నూకరాజు అనే వ్యక్తికి కోళ్ల వ్యాను ఢీకొని గాయాలయ్యాయి. జేఆర్ పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు యోగాంధ్రకు వెళ్లిన రెండు బస్సుల్లోని వ్యక్తులు మండల కేంద్రంలోని గాయత్రి హోటల్ వద్ద భోజనాలకు దిగారు. మధ్యాహ్నం 12.15 గంటల సమయంలో నూకరాజు రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న కోళ్ల వ్యాను ఢీకొట్టి వెళ్లిపోయింది. నూకరాజుకు కాలు విరగడంతో అదే బస్సులో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు హైవే సీసీ కెమెరాల సాయంతో వ్యాన్‌ను పట్టుకున్నారు. క్షతగాత్రుడి స్వగ్రామం శ్రీకాకుళం రూరల్ మండలంలోని పుక్కళ్లవానిపేట. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఏపీ పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభం

ఎచ్చెర్ల: ఏపీ పాలిసెట్ 2025 తొలివిడత వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ మండలంలోని కుశాలపురంలోని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ప్రారంభమైంది. తొలి రోజు ఒకటి నుంచి 15 వేలు ర్యాంక్ మధ్య విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. పత్రాల పరిశీలన పూర్తి చేసుకున్న వారు 25వ తేదీ నుంచి కళాశాలలు, బ్రాంచ్‌ల ఎంపికకు వెబ్ ఆప్షన్లు ప్రారంభించనున్నారు. రెండో రోజు 15001 నుంచి 32000 ర్యాంక్ వరకూ గల విద్యార్థులు ధ్రువీకరణ పత్రాల పరిశీలనలకు హాజరు కావాలని అధికారులు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రధానాచార్యులు, సహాయ కేంద్రం జిల్లా సమన్వయకర్త డాక్టర్ కె.నారాయణరావు, సీనియర్ అధ్యాపకులు మురళీకృష్ణ పర్యవేక్షణలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను నిర్వహించారు.

హెచ్‌సీ జగదీష్ కుటుంబానికి సాయం



జగదీశ్వరరావు భార్యకు చెక్కు అందజేస్తున్న ఆర్.కృష్ణంనాయుడు, భుజంగరావు

సోంపేట: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ పి.జగదీశ్వరరావు కుటుంబానికి డెత్ రిలీఫ్ ఫండ్ కింద రూ.లక్ష నగదు చెక్కును పోలీస్ అసోసియేషన్ సభ్యులు శనివారం అందజేశారు. వీరు మృతుడు జగదీష్ స్వగ్రామం మండలంలోని ఎర్రముక్కాం గ్రామం వెళ్లి సాయాన్ని అందించారు. జగదీష్ ఇచ్ఛాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించేవారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మృతుడు జగదీష్ కుటుంబ సభ్యులను శనివారం కలిసి రూ.లక్ష చెక్కును సతీమణి పుష్పలతకు జిల్లా పోలీసు యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కృష్ణంనాయుడు, ట్రెజరర్ కె.భుజంగరావులు అందజేసి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నేడు శ్రీకాకుళంలో ఒలింపిక్ డే రన్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో ఒలింపిక్ డే రన్ ఆదివారం ఉదయం జరగనుంది. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్తంగా ఏటా నిర్వహించే ఈ ఒలింపిక్ డే రన్ ర్యాలీ నేడు ఉదయం 6.30 గంటలకు శ్రీకాకుళం నగరంలోని పొట్టిశ్రీరాములు జంక్షన్ నుంచి మొదలుకానుంది. అక్కడ నుంచి కళింగరోడ్, వైఎస్సార్ సర్కిల్, పాలకొండ రోడ్, కృష్ణాపార్క్, డే అండ్ నైట్ జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్ మీదుగా కోడిరామ్మూర్తి స్టేడియం వరకు సాగుతుంది. కార్యక్రమంలో క్రీడాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సీఈఓ పి.సుందరరావు, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు సంయుక్తంగా కోరారు.



ఆర్ట్స్ కళాశాల మైదానంలో యోగా ప్రదర్శన

యోగా నిరంతర అభ్యాసం

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కల్చరల్: యోగాను నిరంతర అభ్యాసంగా మార్చుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 21 నుంచి జిల్లాలో 6500 ప్రదేశాల్లో యోగాసనాల శిక్షణ నిర్వహించామన్నారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో పడేసిన బాటిల్స్, పాలిథిన్ కవర్లు శుభ్రం చేశారు. మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట వేయాలని యువతకు సందేశం ఇచ్చారు. 1972 టోల్‌ఫ్రీ నంబరుకు వీటిపై సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంచాలకులు బి.శాంతిశ్రీ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.అనిత, నెహ్రూయువ కేంద్రం ఉపసంచాలకులు వెంకట్ ఉజ్వల్, ఆయూష్ వైద్యులు జగదీష్, ఉత్తమరాజ్‌రాణా తదితరులు పాల్గొన్నారు.



ఎంటీఎస్ టీచర్లకు సర్దుపోటు

- మినిమమ్ టైమ్ స్కేల్ టీచర్లకు అడుగడుగునా అవమానాలు, అన్యాయాలు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పోస్టింగులు ఇవ్వడంతోనే ఈ దుస్థితి
- జిల్లాలో 1998 టీచర్లు 260 మంది, 2008 టీచర్లు 111 మంది
- నేడు జిల్లా కేంద్రంలో మినిమమ్ టైమ్ స్కేల్ టీచర్లకు సర్దుబాటు బదిలీ కౌన్సెలింగ్

శ్రీకాకుళం న్యూకాలనీ:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియామకమైన మినిమమ్ టైమ్‌స్కేల్ ఉపాధ్యాయులకు ఎట్టకేలకు సర్దుబాటు బదిలీల కౌన్సెలింగ్‌కు అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం వీరికి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి 2008 బ్యాచ్ టీచర్లకు, ఉదయం 10 నుంచి 1998 బ్యాచ్ టీచర్లకు బదిలీల కౌన్సెలింగ్ చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను అధికారులు ఇప్పటికే జారీ చేశారు.

ఉద్యోగాలు కల్పించి ఆదుకున్న వైఎస్ జగన్ ప్రభుత్వం..

సాధారణ ఉపాధ్యాయ బదిలీల్లో 1998 డీఎస్సీతో పాటు 2008 డీఎస్సీ మినిమమ్ టైం స్కేల్ టీచర్లు తీవ్ర అన్యాయానికి గురయ్యారు. ఎంటీఎస్ టీచర్లు పనిచేస్తున్న పోస్టులను ఖాళీల జాబితాలోకి తీసుకురావడంతో వారి పోస్టులు గల్లంతయ్యాయి. దీంతో వీరందరికీ కౌన్సెలింగ్ అనివార్యంగా మారింది. ఇదిలా ఉంటే 1998 డీఎస్సీతో పాటు 2008 డీఎస్సీలో అన్యాయానికి గురై న్యాయస్థానాల్లో దశాబ్దాలపాటు కేసులతోను, అనేక ప్రభుత్వాల ముఖ్యమంత్రులు, ప్రజాప్రతినిధులు చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. ఎట్టకేలకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో 2023లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీరి



ఎంటీఎస్ టీచర్ల కౌన్సెలింగ్‌లో ఓ ఉపాధ్యాయుడు (ఫైల్)

పాలిట దేవుడయ్యారు. వీరందరికీ మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) పద్ధతిన ఉద్యోగాలు కల్పించి ఆపద్బాంధవుడిగా నిలిచారు. వీరిలో 70 శాతం మంది పదవీ విరమణ దశకు చేరుకున్నారు.

కూటమి ప్రభుత్వంలో అడుగడుగునా అన్యాయం..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో వీరి పరిస్థితి బాగానే ఉండేది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అడుగడుగునా అన్యాయం జరుగుతోంది. వేధింపులు సైతం ఎక్కువయ్యాయి. గతంలో ఉన్న 12 నెలల జీతాన్ని కూటమి ప్రభుత్వం 11 నెలలకు మార్చివేసింది. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ సాధారణ బదిలీల్లోను అన్యాయం జరిగింది. వీరి భార్య లేదా భర్త ప్రభుత్వ ఉద్యోగి అయితే వారికి కచ్చితంగా బదిలీల్లో స్పౌజ్ పాయింట్లు కేటాయించాలి. కానీ కూటమి ప్రభుత్వం ఎంటీఎస్ టీచర్లను ఇప్పటికీ తమ వ్యతిరేకులుగానే చూస్తోంది. కేజీబీవీల్లోని టీచర్లకు స్పౌజ్ పాయింట్లు కేటాయిస్తున్నప్పటికీ ఎంటీఎస్ టీచర్లకు మాత్రం మొండిచేయి చూపడాన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు తప్పుబడుతున్నారు.

జిల్లాలో ఎంటీఎస్ టీచర్లు 371 మంది..

శ్రీకాకుళం జిల్లాలో 1998 డీఎస్సీ టీచర్లు 260 మంది, 2008 డీఎస్సీ టీచర్లు మంది 111 కలిపి మొత్తం 371 మంది మినిమమ్ టైం స్కేల్ విధానంలో వివిధ పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లగా పనిచేస్తున్నారు. వీరిలో మెజారిటీ టీచర్లు ఈ రెండు మూడేళ్లలో రిటైర్ కానున్నారు. ఈ జూన్ నెలలోనే 8 మంది వరకు పదవీ విరమణ చేయనుండడం గమనార్హం. ఈ నెలలోనే పదవీ విరమణ చేయనున్న ఎంటీఎస్ టీచర్లు సైతం నేడు జరిగే సర్దుబాటు బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరుకానున్నారు. ఇదిలా ఉండగా బదిలీల్లో ప్రాధాన్యం ఎవరికి..? ఇవ్వాలన్న అంశం చర్చనీయాంశంగా మారింది. తమ వృద్ధాప్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ 1998 ఎంటీఎస్ టీచర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం జరగనున్న బదిలీల్లో తమను దూర ప్రాంతాలకు పంపిస్తే.. అరకొర జీతాలతో ఎలా వెళ్లగలమని వారంతా వాపోతున్నారు. ప్రభుత్వం కూడా బదిలీల్లో 2008 డీఎస్సీ ఎంటీఎస్‌లకు తొలి ప్రాధాన్యమివ్వాలని భావిస్తోంది. అదే జరిగితే తాము అన్యాయమైపోతామని 1998 ఎంటీఎస్ టీచర్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే బదిలీలకు సంబంధించిన సీనియారిటీ జాబితాను ప్రకటించారు. మిగిలి ఉన్న సర్వీసును పరిగణనలోకి తీసుకుని మానవతా దృక్పథంతో స్థాన చలనానికి అవకాశం కల్పించాలని ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘ నాయకులు విన్నవిస్తున్నారు.



ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్ జరిగే శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

నేడు కౌన్సెలింగ్



శ్రీకాకుళం జిల్లాలో 2008, 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లకు ఆదివారం కౌన్సెలింగ్ చేపడుతున్నాం. శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం ఈ ప్రక్రియను పూర్తి చేస్తాం. ప్రతి ఒక్కరూ నిర్దేశిత సమయానికి చేరుకోవాలి. ప్రభుత్వ మార్గదర్శకాలు, విధివిధానాల ప్రకారమే సీనియారిటీ ప్రాతిపదికనే కౌన్సెలింగ్ చేపడతాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం

● శ్రమ దోపిడీ ఇక చెల్లదంటూ..



38 రోజులుగా వారు ఆందోళన చేస్తున్నారు. నిత్యం సమస్యలు విన్నవిస్తూనే ఉన్నారు. నినాదాల రూపంలో తమ డిమాండ్లు వినిపిస్తూనే ఉన్నారు. అయినా ఎవరూ స్పందించలేదు. ఇలా అయితే లాభం లేదని శనివారం ఇంజినీరింగ్ కార్మికులంతా శ్రీకాకుళంలోని కార్పొరేషన్ కార్యాలయం డాబా ఎక్కారు. అక్కడి నుంచి అందరికీ తెలిసేలా తమ సమస్యలను చెప్పుకున్నారు.

- శ్రీకాకుళం పీఎన్ కాలనీ

గురుకులాల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంబేడ్కర్ గురుకుల విద్యాలయాలలో 2025–2026 విద్యా సంవత్సరానికి గురుకుల 2025 ఎంట్రన్స్ టెస్ట్ రాసి, సీటు రాని 5వ తరగతి విద్యార్థులకు... బాలికలకు అంబేడ్కర్ గురుకులం ఎచ్చెర్లలోను, బాలురకు ఈ నెల 23న దుప్పలవలసలలో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయించనున్నట్టు కోఆర్డినేటర్ గ్రేస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 26న బాలికలకు అంబేడ్కర్ గురుకులం ఎచ్చెర్లలోను, బాలురకు ఈనెల 27న దుప్పలవలసలో కౌన్సిలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తామన్నారు. ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గురుకులాల జిల్లా సమన్వయకర్త గుంపుల గ్రేస్ తెలిపారు. వివరాలకు 9701736862/ 9000314209 నంబర్లను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణపత్రం, ఇతర విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు.

గ్రామంలో ఒంటరి జీవితం



ఆదుకోవాలని కోరుతున్న పోర్టు బాధితులు మహాలక్ష్మి, కనకరత్నం

సంతబొమ్మాళి : మూలపేట పోర్టు నిర్మాణంలో భాగంగా విష్ణుచక్రం ఊరు మొత్తం ఖాళీ అయ్యింది. కానీ ఆ వృద్ధ దంపతులు మాత్రం గ్రామాన్ని వదిలి వెళ్లలేదు. పగలు, రాత్రి బిక్కుబిక్కుమంటూ ఒంటరి జీవితం గడుపుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మూలపేట, విష్ణుచక్రం గ్రామస్తులు తమ భూములతో పాటు గ్రామాన్ని కూడా పోర్టు నిర్మాణానికి త్యాగం చేశారు. నష్టపరిహారంతో పాటు నౌపడలోని 58 ఎకరాల్లో ఈ రెండు గ్రామాలకు పునరావాస కాలనీ గత ప్రభుత్వ హయాంలోనే మొదలైంది. అయితే మొదటి విడతగా విష్ణు చక్రం గ్రామానికి చెందిన 57 మందికి లాటరీ ద్వారా పునరావాస కాలనీలో ప్రతి కుటుంబానికి ఐదు సెంట్లు ఇంటి స్థలాన్ని కేటాయించారు. దీంతో విష్ణుచక్రం గ్రామాన్ని ఖాళీ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. గ్రామంలో అందరూ ఖాళీ చేసినా గ్రామానికి చెందిన గిన్ని ఈశ్వరరావు, మహాలక్ష్మి అనే వృద్ధ దంపతులు మాత్రం ఊరిని విడిచి వెళ్లలేదు. పీడీఎఫ్ పరిహారం ఇవ్వలేదని, నౌపడలో పునరావాస కాలనీలో ఇంటి స్థలం ఇవ్వలేదని, కన్న ఊరును విడిచి వెళ్లకుండా బిక్కుబిక్కుమంటూ పగలు, రాత్రి జీవనం సాగిస్తున్నారు. ఇంటి స్థలం ఇవ్వకపోతే తాము ఎక్కడికి వెళ్లినా ఎలా బతకగలమని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మనుషులు ఎవరూ లేకపోవడంతో భయాందోళనతో బతుకుతున్నామని, తాగునీటి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన దారపు కనకరత్నం కూడా పీడీఎఫ్ పరిహారం, పునరావాస కాలనీలో ఇంటి స్థలం ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

'యోగాంధ్ర కాదు.. ఉద్యోగాంధ్ర కావాలి'



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

నరసన్నపేట: రాష్ట్రాన్ని యోగాంధ్రగా కాదని ఉద్యోగాంధ్రగా మార్చాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ఏడాది గడిపేసిందని విమర్శించారు. వీరు శనివారం నరసన్నపేటలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఒక వైపు అప్పులు చేస్తూ మరో వైపు గొప్పల కోసం తిప్పలు పడుతోందన్నారు. విశాఖలో యోగాంధ్ర పేరిట కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రజాధనం వృధా చేశారని మండిపడ్డారు. గిరిజన స్కూల్స్‌లో నాణ్యమైన విద్య, మంచి భోజనం అందించినప్పుడే యోగాంధ్ర లాంటి కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు. మన జిల్లాలో నిరుద్యోగులకు ఎలా ఉపాధి కల్పిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే యువత, నిరుద్యోగుల తరపున ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు ఆర్. అరవిందు, వై. వేణు, జి. వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలు సర్దేశారు..!



ఆమదాలవలస రైతుబజార్‌లో ఖాళీగా దర్శనమిస్తున్న దుకాణాలు

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస బస్టాండ్‌కు సమీపంలో ఏర్పాటు చేసిన రైతు బజార్ ఖాళీగా దర్శనమిస్తోంది. కొనుగోలుదారులు అంతగా రాకపోవటంతో రైతులు తమ దుకాణాలను పూర్తిగా ఖాళీ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి నేరుగా విక్రయించుకునేందుకు గతంలో రైతు బజార్లను ఏర్పాటు చేశారు. ఆమదాలవలస రైతు బజారులో 48 దుకాణాలను ఏర్పాటు చేశారు. అయితే ఒకటి రెండు దుకాణాల్లో కిరాణా, బియ్యం వంటివి విక్రయించుకొని రైతులు తమ వ్యాపారం సాగిస్తున్నారు. అయితే పట్టణానికి దూరంగా ఈ రైతు బజారును నిర్మించడం వల్ల కొనుగోలుదారులు అంత దూరం వెళ్లడానికి సుముఖత చూపడం లేదు.

మున్సిపాలిటీ పరిధిలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో కొత్తగా కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేసి అనేక దుకాణాలు నిర్మించి వ్యాపారులకు అద్దెలకు ఇవ్వటంతో వ్యాపారమంతా అక్కడే కొనసాగుతోంది. దీంతో విక్రయదారులు రైతు బజారుకు వచ్చే అవకాశం లేకపోవటంతో రైతులంతా ఒక్కసారిగా ఖాళీ చేశారు. ముఖ్యంగా ప్రభుత్వం రైతులకు సంబంధించిన పంటలను కొనుగోలు చేసి ఉల్లి, టమాటా వంటి వస్తువులు రైతు బజార్ల ద్వారా రాయితీపై అందించాల్సి ఉంది. అసలు రైతు బజారే లేకపోతే రాయితీపై సరుకులు ఎలా ఇస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. తుఫాన్, వరదలు వంటి సమయంలో ప్రజలకు కావాల్సిన నిత్యావసర వస్తువులు రైతు బజార్ల ద్వారానే ప్రభుత్వం అందిస్తుంది. అయితే ఆమదాలవలసలో పూర్తిగా రైతు బజారే మూతపడే పరిస్థితి ఉంటే ప్రజలను కూటమి ప్రభుత్వం విపత్తుల సమయంలో ఎలా ఆదుకుంటుందో ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ పాలకులు, అధికారులు రైతులకు ఎంతో మేలు కల్పించే ఈ రైతు బజార్‌ను తెరిపించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

● జాబ్‌మేళా రేపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 23న ఎచ్చెర్లలోని టీటీడీసీలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో బ్రాంచి మేనేజర్ పోస్టులు 8 ఉన్నాయని, ఎంపికైన వారు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. 18–35 ఏళ్ల వయసు గల స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని ఎంబీఏ, మార్కెటింగ్ ప్రత్యేక సబ్జెక్టు కలిగి ఉండాలని తెలిపారు. ఇంటర్వ్యూలు సోమవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతలకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి జిల్లాకు చెందిన ప్రగడ రామ్‌నాయుడు, గజలక్ష్మి దంపతులు, వారి కుమారుడు బాలాదిత్య రూ.1,00,001 విరాళంగా సమర్పించారు. ఈమేరకు ఆలయ సీనియర్ అసిస్టెంట్ వెంకట రమణకు శనివారం విరాళం అందజేశారు. అంతకుముందు ఆదిత్యున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ బాలభాస్కర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

49 ఆశావర్కర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

అరసవల్లి: జిల్లాలో ఖాళీగా ఉన్న 49 ఆశా వర్కర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత ప్రకటించారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో వివరాల ప్రకారం.. జిల్లాలో ఈ పోస్టులకు ఆసక్తి గల అర్హులు ఈ నెల 23 నుంచి 30వ తేదీలోగా ఆయా ప్రాంతాల్లో ఉన్న సచివాలయాల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 10వ తరగతి ఉత్తీర్ణత, 25 నుంచి 45 ఏళ్ల లోపు వయస్సున్న అదే గ్రామానికి చెందిన మహిళలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. జిల్లాలో అక్కులపేట, బూర్జ, ఎచ్చెర్ల, బాతువ, జి.సిగడాం, గార, కొలిగాం, బొరివంక, తిలారు, నిమ్మాడ, రెంటికోట, తాడివలస, పాతర్లపల్లి, రావాడ, బోరుబద్ర, డి.జి.పురం, నౌపడ, సంతబొమ్మాళి, సింగుపురం, శ్రీకాకుళం రూరల్, అక్కుపల్లి, కంచిలి, నందిగాం, నౌగాం, బైదలాపురం, బొంతు, సారవకోట, కె.కొత్తూరు, లింగాలవలస, ఎల్ఎన్.పేట తదితర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోనూ అలాగే అరసవల్లి, ఫాజుల్‌బాగ్‌పేట, కాకివీధి, డీసీసీబీ కాలనీ, ఆదివారంపేట అర్బన్ పిహెచ్‌సీ పరిధిలోనూ అలాగే సచివాలయాల పరిధిలో మొత్తం 49 ఆశావర్కర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లుగా డీఎంహెచ్‌ఓ అనిత ప్రకటించారు.

జెమ్స్‌లో యోగా డే



యోగాసనాలు వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆవరణలో యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీలలిత, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా, బొల్లినేని మెడిస్కిల్స్ బీఎస్సీ పారామెడికల్ కళాశాలలోనూ యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్ కుసురాజు, జగదీష్, అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మీ పద్మజ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మిగులు సీట్లు నిరుపేద దళితులకు ఇవ్వాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం పాత బస్టాండ్: ఏపీఆర్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియెట్ ప్రవేశాల్లో భర్తీ చేయగా మిగిలిన సీట్లలో ప్రవేశ పరీక్ష రాయని నిరుపేద దళిత విద్యార్థులను చేర్పించుకోవాలని కులనిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

విలీన గందరగోళం.. పాఠశాలలకు తాళం

- గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన
- మోడల్ ప్రైమరీ స్కూళ్ల పేరిట ప్రభుత్వం నయవంచన
- సుదూర ప్రాంతాలకు వెళ్లలేక ఆవేదన
- కూటమి సర్కారు తీరుపై సర్వత్రా విమర్శలు

శ్రీకాకుళం న్యూకాలనీ:

పాఠశాల విద్యలో ప్రభుత్వ బడులను 9 రకాల స్కూళ్లగా విభజించి అటు ఉపాధ్యాయులను, ఇటు విద్యార్థులను కూటమి ప్రభుత్వం గందరగోళంలోకి నెట్టింది. విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ పిల్లలకు ప్రాథమిక విద్యను 'దూరం' చేస్తోంది. ఒకప్పుడు సొంత ఊరిలోనే ఉండి చదువుకున్న పరిస్థితుల నుంచి.. నేడు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువు కొనాల్సిన దుస్థితి కల్పిస్తోంది. పునర్విభజన జరిగిన శ్రీకాకుళం జిల్లాలో తరగతుల విలీనమైన బడుల సంఖ్య 338 ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో 6,7,8 తరగతులు సమీపంలో విలీనమైన స్కూళ్లు 93 ఉండగా.., 3,4,5 తరగతుల విలీనం జరిగిన స్కూళ్లు ఏకంగా 245 ఉండటం గమనార్హం. ఒక్క పొందూరు మండలంలోనే సుమారు 12 ప్రాథమికోన్నత తరగతులను పొరుగున ఉన్న హైస్కూళ్లలో కలిపేశారు. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లోను ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో తరగతులు విలీనం కావడంతో విద్యార్థులతో కలిపి తల్లిదండ్రులు బడుల వద్ద నిరసన చేస్తున్నారు. కొన్నిచోట్ల తాళం వేస్తున్నారు.

జిల్లాలో 9 రకాల ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల సంఖ్య ఇలా..

క్రమ సంఖ్య	పాఠశాల పేరు	వాటి సంఖ్య
1.	పీపీ 1, 2 (అంగన్‌వాడీలు)	-
2.	శాటిలైట్ స్కూళ్లు	17
3.	ఫౌండేషనల్ స్కూళ్లు	248
4.	బేసిక్ ప్రైమరీ స్కూళ్లు	1682
5.	మోడల్ ప్రైమరీ స్కూళ్లు	385
6.	అప్పర్ ప్రైమరీ స్కూళ్లు	198
7.	హైస్కూళ్లు	295
8.	హైస్కూల్ + బీపీఎస్ (1 నుంచి 10/1-12 క్లాసుల వరకు)	89
9.	హైస్కూల్+ఎంపీఎస్ (1 నుంచి 10/1-12 క్లాసుల వరకు)	41
మొత్తం		2955



మందస మండలం హొన్నాళిలో 6,7,8 తరగతులకు స్థానికంగానే పాఠాలు బోధించాలంటూ ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

అలవెన్సులు ఇస్తారట..

ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య (6-14సంవత్సరాలు) అనేది రాజ్యాంగం బాలలకు ఇచ్చిన హక్కు. దానిని కూడా ట్రాన్స్‌పోర్ట్ అలవెన్సు పేరిట ప్రత్యామ్నాయ దిశగా హరించడాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు. ప్రభుత్వ నిర్ణయాలను బాలల హక్కుల సంఘాలు, మహిళా శిశుసంక్షేమ శాఖ, మానవ హక్కుల సంఘాలు వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు చెబుతున్నారు. తక్షణమే బాలలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక హక్కును కల్పించాల్సిందేనని నొక్కి చెబుతున్నారు. పాఠశాలల విలీనం తరువాత సింగిల్ టీచర్ స్కూళ్లే అధికమయ్యాయి తప్పిస్తే.. పిల్లలకు ఏవిధంగా మేలు జరిగిందో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. ఒకటి నుంచి పది తరగతులు నడపడానికి ప్రపంచంలో ఎక్కడా తొమ్మిది రకాల స్కూళ్లు లేవని.. ఒక్క ఏపీలోనే ఈ దుస్థితి ఉందని, ఇది సిగ్గుపడాల్సిన విషయమని విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏ స్కూల్‌కు పంపించాలో..

కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన 9 రకాల స్కూళ్లతో తమ పిల్లలను ఏ స్కూల్‌కు తమ పిల్లలను పంపించాలో తెలియక తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. మరోవైపు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతలు, శిక్షణా తరగతలు పూర్తిచేసుకుని.. ఇప్పుడిప్పుడే ఉపాధ్యాయులు బడిబాట పడుతున్నారు. కొత్త పాఠశాలల్లో చేరిన టీచర్లకు సైతం స్థానిక పరిస్థితులు, స్థితిగతులు తెలియక అయోమయానికి గురవుతున్నారు.

ఇదీ పరిస్థితి..

శ్రీకాకుళం జిల్లాలో ఈ కొత్త విద్యా సంవత్సరంలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు 2955 పనిచేయనున్నాయి. గత విద్యా సంవత్సరం ప్రకారం 1,62,554 మంది చదువుతున్నట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఈ సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడుతున్నట్టు తెలుస్తోంది. చంద్రబాబు సర్కారు నిర్లక్ష్యపు విధానాలు, ఏకపక్ష నిర్ణయాలతో విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తుండటంతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు బడుల్లో చేర్పించడానికి మొగ్గుచూపుతున్నట్టు ఉపాధ్యాయులే బాహాటంగా చెబుతున్నారు. 400 ప్రైవేటు పాఠశాలల్లో 95వేల మంది వరకు చదువులు కొనసాగిస్తున్నారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.



పాఠశాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ పొందూరు మండలం కోటిపల్లి స్కూల్ వద్ద గుమికూడిన గ్రామస్తులు



ఇటీవల బూర్జ మండలం ఉవ్వపేట ప్రాథమిక పాఠశాలకు తాళం వేసిన గ్రామస్తులు, తల్లిదండ్రులు

మా పిల్లలను వేరే స్కూల్‌కు పంపించలేం

- వనుమువానిపేట పాఠశాల వద్ద తల్లిదండ్రుల నిరసన



శనివారం వనుమువానిపేట స్కూల్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

గార : మా పిల్లలను కిలోమీటరు దూరంలో ఉన్న వేరే పాఠశాలకు పంపలేమంటూ గార మండలం వనుమువానిపేట పాఠశాల వద్ద తల్లిదండ్రులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ మాధవి, మాజీ చైర్మన్ రమణలు మాట్లాడుతూ పాఠశాలలో మొత్తం 26 మంది విద్యార్థులుండగా, ఆదర్శ పాఠశాల పేరు చెప్పి తండ్యాలపేట పాఠశాలకు 3, 4, 5వ తరగతుల విద్యార్థులను కలిపేందుకు నిర్ణయించారని, పాఠశాల నుంచి 12 మంది విద్యార్థులు ప్రతీ రోజు పుస్తకాల బరువుతో ఎలా వెళ్లగలరని ప్రశ్నించారు. దారిలో కుక్కల గుంపులు వంటి సమస్యలున్నాయని, ఈ విషయాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందరూ రోజువారీ వ్యవసాయం, కూలి పనులుకు వెళ్లకపోతే బతకలేని పరిస్థితి ఉందని, చిన్నారులను రోజు తీసుకువెళ్లి, తీసుకురావడం ఇబ్బంది అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గొండు శంకర్, విద్యాశాఖ అధికారులు స్పందించి సమస్య పరిష్కారించాలని కోరారు.

సాధ్యమయ్యేనా?



విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా రెండు, రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న సమీప పాఠశాలల్లో ఉన్న 3,4,5 తరగతులను చేసేశారు. 4 లేదా 5 కిలోమీటర్ల దూరంలో ఉండే ఉన్నత పాఠశాలల్లో 6,7,8 తరగతుల పిల్లలను విలీనం చేసేశారు. ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించినా ప్రభుత్వం మాత్రం వెనక్కి తగ్గలేదు. ఇదేంటని ప్రశ్నిస్తే రవాణా (ట్రాన్స్‌పోర్ట్) అలవెన్సు ఇస్తామని అధికారులు చెబుతున్నారు. ఇది సాధ్యమయ్యేపనేనా ?

– ఎండ ఉమాశంకర్, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే..



ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారమే బడులను విభజించాం. విద్యాహక్కు చట్టానికి లోకబడే చర్యలు తీసుకున్నాం. కొన్నిచోట్ల విద్యార్థుల సంఖ్య ఆధారంగా తప్పని పరిస్థితుల్లో సమీప పాఠశాలల్లో తరగతుల విలీనం చేపట్టాల్సి వచ్చింది. కొన్ని స్కూళ్ల వద్ద తల్లిదండ్రులు ఆందోళన చేపడుతున్నట్టు తెలిసింది. వాటి వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తాం.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఈఓ శ్రీకాకుళం

మూడు కిలోమీటర్లు ఎలా వెళ్లేది?



ఉవ్వపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో 1, 2వ తరగతిలో విద్యార్థులు లేరు. 3, 4, 5వ తరగతుల విద్యార్థులను నీలాదేవిపురం గ్రామ పాఠశాలలో విలీనం చేస్తున్నారు. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ పాఠశాలకు పిల్లలు ఎలా వెళ్తారు?

– బొల్లు అసిరినాయుడు, ఉవ్వపేట, వావాం పంచాయతీ, బూర్జ మండలం

కొనసాగించాల్సిందే..



నిబంధనల పేరిట గ్రామంలో పాఠశాలను తరలించడం తగదు. అలాకాదని విలీనం చేస్తే గ్రామంలో అంతదూరం పిల్లలను పంపించలేం. ప్రభుత్వం స్పందించి గ్రామంలోనే పాఠశాలను కొనసాగించాలి.

– మురపాక శంకరరావు, విద్యాకమిటీ చైర్మన్, అల్లెన గ్రామం, బూర్జ మండలం

ప్రయాణికుల కస్సు'బస్సు'

- ఉదయం పూట బస్సులు ఉన్నా కానరాని ప్రయాణికులు
- మధ్యాహ్నం పూట ప్రయాణికులు ఉన్నా లేని బస్సులు
- ఆర్టీసీ అధికారుల తీరుపై మండిపాటు



ఉదయం ఇలా: బస్సులు ఉన్నా ప్రయాణికులు లేక బోసిపోయిన నాన్‌స్టాప్ కౌంటర్



మధ్యాహ్నం ఇలా: బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శనివారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం విశాఖపట్నంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమానికి జనాలను తరలించేందుకు జిల్లా నుంచి 220 బస్సులు వేసిన సంగతి తెలిసిందే. దీంతో చాలా రూట్లలో బస్సులు తిరగకపోవడంతో ముఖ్య ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంత ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వింత పరిస్థితి నెలకొంది. శనివారం ఉదయం నుంచి దూరప్రాంతాలకు వెళ్లేందుకు కాంప్లెక్స్‌లో బస్సులు ఉన్నప్పటికీ ప్రయాణికులు ఎవరూ కనిపించలేదు. ముఖ్యంగా విశాఖ వెళ్లే నాన్‌స్టాప్ కౌంటర్ ఖాళీగా కనిపించింది. మధ్యాహ్నం 12గంటల వరకూ బోసిపోయి కనిపించింది. ప్రయాణికులు రాక ఆ బస్సులు అలాగే ఉండిపోయాయి. ఇక ఇచ్ఛాపురం, పాతపట్నం, బత్తిలి, రాజాం, బొబ్బిలి, విజయనగరం, పాలకొండ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్టాప్‌ల వద్ద ప్రయాణికులు కూడా అంతంత మాత్రంగానే ఉండటం కనిపించింది.

తప్పని పడిగాపులు..

శనివారం మధ్యాహ్నం సమయంలో ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండటం కనిపించింది. యోగాంధ్ర కార్యక్రమం పూర్తయి బస్సులు వచ్చేస్తాయని భావించి అనేక మంది ప్రయాణికులు రావడంతో ఈ పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకూ అధిక సంఖ్యలో ప్రయాణికులు కాంప్లెక్స్‌కు చేరుకున్నా బస్సులు లేక గంటల తరబడి నిరీక్షించారు. మారుమూల గ్రామాలకు వెళ్లేందుకు సైతం బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది.

ముందస్తు సమాచారం లేకే..

విశాఖపట్టణంలో జరిగిన యోగాంధ్రకు ఆర్టీసీ బస్సులను తరలించిన నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు తిరగవని అధికారులు ముందస్తు సమాచారం చేరవేస్తే బాగుండేదని, తమ ప్రయాణాలను వాయిదా వేసుకునేవారమని పలువురు ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.

నేటి నుంచే సంప్రదాయ వస్త్రధారణ అమలు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈఓ కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ ఆదేశాల మేరకు సంప్రదాయ వస్త్రధారణ నిబంధనలు ఆదివారం నుంచే అమల్లోకి రానున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆదివారం జరిగే సూర్యనమస్కార పూజల్లో పురుషులు కచ్చితంగా పంచె, చొక్కా, మహిళలు చీర చూడీదార్‌ను మాత్రమే ధరించి పూజల్లో కూర్చునేలా చర్యలు చేపట్టనున్నారు. ఎలాంటి ఫ్యాషన్ దుస్తులతో దర్శనాలకు అనుమతించకుండా ఈవో ప్రసాద్ ఇప్పటికే సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించినట్లుగా తెలిసింది. నేటి నుంచి అంతరాలయ దర్శనాలను సాయంత్రం 6 గంటల వరకు పొడిగింపు నిర్ణయాన్ని కూడా అమలు చేయనున్నారు.. దీంతో భక్తులకు మరింత సౌకర్యవంతంగా అంతరాలయ దర్శనానికి వీలవుతుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

అంబేడ్కర్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీ అంబేడ్కర్ ఆలోచన ఫౌండేషన్ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ ఆలోచన ఫౌండేషన్ రాష్ట్ర చైర్మన్, సీనియర్ అడ్వకేట్ పినిపే వెంకట రామకృష్ణ అన్నారు. నగరంలోని ఇలిసిపురం అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ క్యాడర్ క్యాంపు శనివారం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 158 బార్ కౌన్సిల్‌లు ఉన్నాయని, వాటిలో ఏఎఎఫ్ క్యాడర్ కూడా ఉందన్నారు.

ఎనిమిది వేల మంది ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులున్నారని, మనమంతా ఐక్యతను చాటి చెప్పాలన్నారు. ఏఎఎఫ్ అనేది నిరంతర ప్రక్రియ అని, ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని స్పష్టం చేశారు. అంబేడ్కర్ మూమెంట్ నడపాలంటే కఠోర దీక్ష ఉండాలని, నాయకునికి ఎటువంటి బలహీనతలు ఉండకూడదని చెప్పారు. రాజకీయ పార్టీలు ఎస్సీ, ఎస్టీలను విభజించి పాలిస్తున్నాయన్నారు. ఈసారి రాష్ట్ర బార్ కౌన్సిల్ పోటీల్లో ముగ్గురు న్యాయవాదులు తప్పనిసరిగా గెలవాల్సిన అవసరం ఉందన్నారు. మనకు ఎవ్వరూ ఎటువంటి పదవులు ఇవ్వరని, పోరాటాల ద్వారానే సాధించుకోవాలని పిలుపునిచ్చారు. బతికినంత కాలం అంబేడ్కర్ విధానంతో బతకాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పొన్నాడ రాము, బి.మురళీకృష్ణ, రుంకు అప్పారావు, గంజి ఆర్.ఎజ్రా, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, అడ్వకేట్ దండాసి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పొందూరు: పొందూరు రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఉదయం ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందినట్లు హెచ్‌సీ ఎం.సోమేశ్వరరావు తెలిపారు. రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు చెప్పారు. మృతుడు తెలుపు, నలుపు గీతల షర్టు, నల్లని నిక్కరు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. వివరాలకు 9110305494 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

యువకుడు ఆత్మహత్య



నూకరాజు మృతదేహం

కాశీబుగ్గ : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు సూదికొండ ప్రాంతంలో సూర్యకాలనీకి చెందిన కొవిరి నూకరాజు (22) అనే యువకుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడి కార్మికుడు నారాయణరావు రెండో కుమారుడు నూకరాజు తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం మధ్యాహ్నం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న కాశీబుగ్గ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోడ్రైవర్ అనుమానాస్పద మృతి



పి.జగన్నాథం(ఫైల్)

ఎచ్చెర్ల : లావేరు మండలం అదపాక సమీపంలోని పంట పొలాల్లో విశాఖపట్నం జిల్లా తాటిచెట్లపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పి.జగన్నాథం(35) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అదపాక వీఆర్‌వో ఎస్.వెంకటరమణ ఫిర్యాదు మేరకు లావేరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. లావేరు హెచ్‌సీ జోగారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.